క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చౌడేపల్లెలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద సాయం అందింది. వివరాలు..గడ్డంవారిపల్లె పంచాయతీ చౌడగానిపల్లెకు చెందిన ఇంద్రాణి రూ.35 వేలు, చింతమాకులపల్లె పంచాయతీ పిఎల్ కొత్తూరుకు చెందిన మునిరెడ్డి రూ.28 చొప్పున మంజూరైన చెక్కులను గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా రాజశేఖర్ బాబు

సదుం: ఎంపీడీఓగా రాజశేఖర్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పులిచెర్ల ఈఓపీఆర్‌డీగా ఉన్న ఆయనకు ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇక్కడికి బదిలీ చేశారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. గతంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఈఓపీఆర్‌డీ వరప్రసాద్ వ్యవహరించారు.

సామాజిక తనిఖీ గ్రామసభ

పులిచెర్ల(కల్లూరు): మండలంలో వాటర్‌షెడ్ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ గ్రామసభను బుధవారం పాళెంలో నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ మాట్లాడుతూ, వాటర్‌షెడ్ పనుల వలన భూగర్భ జలాల మట్టం పెరగడానికి వీలుంటుందన్నారు. వాటర్‌షెడ్ పనుల గురించి సామాజిక తనిఖీ బృందం గ్రామసభలో నివేదించింది. కార్యక్రమంలో జేఈ తేజ, టీఏలు షబ్బీర్, దొరైరాజ్, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుడుపల్లె: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం డిగ్రీ కళాశాల వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. కర్ణాటకకు చెందిన 196 మద్యం బాటిళ్లతో వెళ్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో వీరిద్దరూ శాంతిపురం మండలం పోడూరుకు చెందిన డి. శ్రీనివాసులు, నల్లగంపల్లెకు చెందిన శివ అని తేలిందని ఎస్ఐ లక్ష్మీకాంత్ చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

ఘనంగా విద్యార్థులకు వీడ్కోలు

వి.కోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అమరనాథ్ మాట్లాడారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని విద్యార్థులు దానిని సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

పెద్దపంజాణి: త్వరలో జరగనున్న ఎన్నికలే టీడీపీకి చివరివి అవుతాయని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెద్దపంజాణిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, పార్టీ నాయకులు జాఫర్, రెడ్డిప్రసాద్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చదువు లేకుంటే అంధకారమే

పుంగనూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉజ్వల భవిత సాధ్యమని, నిర్లక్ష్యం వహిస్తే జీవితం అంధకారం అవుతుందని డీవైఈవో పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం, ఆంగ్లబోధనపై విద్యార్థుల పరిజ్ఞానం, పారిశుధ్యం ఎలా ఉందో పరిశీలించారు. ఎంఈఓ రెడ్డెన్నశెట్టి, ఉపాధ్యాయులు రాజేష్, రఘు, నరసింహులు, భారతి, మునిరాజ, విజయవాణి, శైలజరాణి పాల్గొన్నారు.

కొత్తపేటలో జగనన్న సురక్ష

పుంగనూరు: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్లు గంగులమ్మ, మమత తెలిపారు. బుధవారం పట్టణంలోని కొత్తపేట వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. డాక్టర్లు జగదీష్‌కుమార్, మదన్‌కుమార్, పుష్పకుమారి, రంజిత మొత్తం 409 మందిని పరీక్షించారు.

ఆదిశేషునిపై గోపాలుడి విహారం

వి.కోట: స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి బుధవారం శేష వాహనంపై పుర వీధుల్లో మంగళవాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ విహరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య, కమిటీ సభ్యులు, ఆర్య వైశ్య సభ సభ్యులు పాల్గొన్నారు.

సేమ్ టు సేమ్!

ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఫిబ్రవరి 22న టూన్‌డే డే నిర్వహించడం పరిపాటి. టూన్ డే- అంటే ఇరువురి రోజని అర్థం. సాధారణంగా ఏటా డిసెంబర్ 18న అంతర్జాతీయ కవలల దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. కానీ ఇద్దరు సమానమైన వ్యక్తులకు సంబంధించిన రోజు ఇదే. టూన్ డే పురస్కరించుకుని కవలలపై ప్రత్యేక కథనం.

- పలమనేరు/గంగవరం/ పెద్దపంజాణి/ వీ.కోట

- ఒకేలా ఉన్నా అభిరుచులు వేరు
- మరికొందరు భిన్నం
- నేడు ప్రపంచ కవలల దినోత్సవం

కవలలైనా కలవని అభిప్రాయాలు

గంగవరం మండలం కల్లుపల్లెకు చెందిన జయచంద్రారెడ్డి,భవాని దంపతుల కవల పిల్లలు జాహ్నవి, జస్విని. వీరు పలమనేరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నారు. సాధారణంగా కవలలు ఒకే ఆలోచలను కలిగి ఉంటారు. కానీ వీరి అభిరుచులు మాత్రం వేరు. తమదైన ఆలోచనలతో ముందుకెళ్తున్నారు. ఒకరేమో మహా అల్లరిగా ఉండగా, ఇంకో అమ్మాయి సైలెంట్‌గా ఉంటోంది.



ఇద్దరూ ఇద్దరే..



మున్సిపాలిటీలోని గంటావూరుకు చెందిన ఫిర్దోస్, నౌజియా కవలలు. చిన్నప్పటి నుంచి ఇద్దరికీ ఒకటే అభిరుచులు. వీరిద్దరూ కళాకారులుగా రాణిస్తున్నారు. వీనుల విందుగా జానపదాలను ఆలపిస్తూ సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. వీరి గాత్రం ఇద్దరిదీ గుర్తుపట్టలేనంతగా ఒకేలా ఉండడం విశేషం: ప్రస్తుతం వీరికి వివాహాలై వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా ఇద్దరు కలసి ఆలపిస్తే ఎవరెవరనేది తెలుసుకోవడం కష్టమే.

ఒకరిని వదలి మరొకరు ఉండరు



పెద్దపంజాణి మండలం కమ్మపాళెంకు చెందిన పద్మనాభశెట్టి కుమారులు ధనుష్‌శెట్టి, ధర్మేష్‌శెట్టి కవలలు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు. ఒకరిని వదలి మరొకరు ఉండరు. ఎప్పుడూ ఇద్దరూ కలిసి ఉండాల్సిందే. బడికి ఒకరు వెళ్లకున్నా ఇంకొకరు కూడా వెళ్లని పరిస్థితి. ఇద్దరికీ సేమ్ టు సేమ్ డ్రెస్ కోడ్ ఉండాల్సిందే!

కరాటేలో బ్లాక్ బెల్ట్‌లు సాధించిన కవలలు



వీ.కోట మండలం గాండ్లపల్లెకు చెందిన ప్రకాష్ కుమారులు విఘ్నేష్, విర్నేష్ కవలలు. వీరు ప్రస్తుతం మహారాష్ట్రలోని చంద్రాపూర్ సైనిక్ స్కూల్‌లో చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి పోలికల్లోనే కాదు..ఆలోచన తీరు, అభిరుచులు కూడా ఒకటే. ఇద్దరికీ కరాటే అంటే మహా ఇష్టం. కరాటేలో బ్లాక్‌బెల్టులు కూడా సాధించారు. నాలుగుసార్లు జాతీయస్థాయిలో చాంపియన్స్‌గా నిలిచారు. ఇద్దరూ ఒకే కోర్సు చేసి దేశానికి సైనికులు కావాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారు.

అన్యోన్యమైన రామలక్ష్మణులు



బైరెడ్డిపల్లెకు చెందిన పూల శివ కుమారులు రామ్‌లక్ష్మణ్ కవలలు. ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. శివకు వివాహమై పదేళ్లకు కవలలు కలిగారు. వీరిద్దరూ ఏ పని చేయాలన్నా కలిసే చేయడం, ఇద్దరూ కలసి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటూ రామలక్ష్మణులని పేరు నిలబెట్టుకుంటున్నారు.

అన్నాచెల్లెళ్ల కవల బంధం



పుంగనూరు: అన్నాచెల్లెళ్లుగా ఆ కవలలు అందరికీ సుపరిచితులయ్యారు. చదువుల్లోనూ, కళారంగాల్లోనూ తమదైన శైలిలో రాణిస్తున్నారు. పెద్దపంజాణి మండలం మాదనపల్లెలో నివాసం ఉన్న శ్రీనివాసమూర్తి, చంద్రికకు వివాహమైన 16 ఏళ్లు గడచినా సంతానం కలగలేదు. తిరగని ఆస్పత్రి అంటూ లేదు. గుళ్లా గోపురాలూ తిరి గారు. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు వారికి సంతానం ప్రాప్తించింది. చంద్రిక కవలలకు జన్మనివ్వడంతో ఆ ఇంట సంబరం అంబరాన్ని తాకింది. తొలుత మగబిడ్డ సిద్ధాంత్‌మూర్తి, పదినిమిషాల తరువాత కుమార్తె సాత్విక మూర్తి జన్మించారు. ప్రస్తుతం ఇద్దరూ 5వ తరగతి చదువుతున్నారు. అన్నాచెల్లెళ్లు చదువుల్లో రాణిస్తూనే మరోవైపు సంగీతం, కీబోర్డు, చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్నారు. అందరి వద్దా శభాష్ అనిపించుకుంటున్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



గంగవరం: సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

గంగవరం: మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలందరూ సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. విద్యార్థులకు పద్య పఠనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో11 వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, మాతృభాషపై ప్రతి ఒక్కరూ పట్టు కలిగి ఉండాలన్నారు. అప్పుడే ఇతర భాషలు నేర్చుకోవడం సులభతరం అవుతుందన్నారు. అనంతరం మాతృభాషలో ప్రావీణ్యం చూపిన జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో మొత్తం 20మంది విద్యార్థులకు దాతలు రేవణూరు మురళీ మోహన్ ఒక్కో విద్యార్థికి రూ. 500 చొప్పున బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీనివాసులు, హెచ్ఎం దామోదరం, తెలుగు సాహిత్య సమితి అధ్యక్షులు తులసినాథంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరులో..



పుంగనూరు: గ్రంథాలయంలో..

పుంగనూరు: మాతృభాషలో ఉన్న తీయదనాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ మాతృభాషకు పట్టం కట్టాలని స్థానిక వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక గ్రంథాలయాధికారి తులసినాయక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, రెడ్డెప్పరెడ్డితో పాటు జయరామిరెడ్డి మాట్లాడారు. మాతృభాషకు ప్రాధాన్యత ఇచ్చి మమ్మీ...డాడీ పిలుపులకు స్వస్తి పలకాలన్నారు. అలాగే శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఇదే కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఉర్దూ గ్రంథాలయాధికారి నసీబ్‌జాన్, సిబ్బంది సలీం, పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

చౌడేపల్లె/గుడుపల్లె: కుప్పం నియోజకవర్గంలో ఈనెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ భరత్ పిలుపునిచ్చారు.బుధవారం చౌడేపల్లె, శాంతిపురం మండల కేంద్రాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీనేతలతో సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. గుడుపల్లె మండలంలోని 42 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన వారిని సీఎం సభకు తీసుకురావాలని భరత్ కోరారు. ప్రతి గ్రామ పంచాయతీకి రెండు మూడు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, సీఎం సభకు వచ్చే వారికి అన్ని ఏర్పాట్లూ కల్పించి తిరిగి సురక్షితంగా వారి గ్రామాలకు చేర్చాలన్నారు. సమావేశంలో చౌడేపల్లె ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, జిల్లా జంగమ వీర శైవ సంఘం అధ్యక్షుడు నాగరాజ, గుడుపల్లె ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, కన్వీనర్ రామక్రిష్ణ, కో-కన్వీనర్ హరినథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి

పుంగనూరు: వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉత్పన్నమైతే వాటిపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ మునిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు సభ్యులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. మాగాండ్లపల్లెలో కరెంటు సక్రమంగా సరఫరా కావడం లేదని ఎంపీటీసీ నాగభూషణరెడ్డి నివేదించారు. అలాగే సింగిరిగుంటలో నీరు వృథా అవుతోందని, కొళాయిలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఆంజప్ప కోరారు. అలాగే శికారిపాళ్యెం, కమ్మవారిపల్లె, ఓబిరెడ్డిపల్లె, ఆరడిగుంట, సుగాలిమిట్ట ప్రాంతాలలో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. అలాగే రైతులకు టమాట ట్రేలు కావాలని, మొక్కల కోసం పాలిథిన్ కవర్లు ఇవ్వాలని కోరారు. అలాగే డ్రిప్ ఎరువులను ఆర్బీకేలతో పంపిణీ చేయాలన్నారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై ఎంపీపీ పైవిధంగా మాట్లాడారు. సమావేశంలో అతిథులుగా పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, బోయకొండ చైర్మన్ నాగరాజారెడ్డి, వైస్ ఎంపీపీలు ఈశ్వరమ్మ, సరోజమ్మ, కో-ఆప్షన్ మెంబరు బాబ్‌జాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా మున్సిపల్ చైర్మన్ ప్రచారం

పుంగనూరు: రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ప్రజలను కోరారు. బుధవారం ఆయన మున్సిపాలిటిలోని కొత్తపేట, రాగానిపల్లె రోడ్డు ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. పథకాలు అందుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. ప్రజలు నివేదించిన సమస్యలను నమోదు చేసుకుని పైవిధంగా అభ్యర్థించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కృష్ణారెడ్డి, బావాజాన్, పార్టీ నాయకులు రాజగోపాల్, సయ్యద్, మల్లికార్జున, నారాయణరెడ్డి, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో చండీ హోమం

వి.కోట: స్థానిక శ్రీ దుర్గామాత ఆలయంలో బుధవారం చండీ హోమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 108 మంది దంపతులు అమ్మవారికి సారెతో పాటు పూజాసామగ్రిని సమర్పించారు. శృంగేరి, కంచి, బెంగళూరుకు చెందిన వేదపండితులు శ్రీధర్‌శర్మ నేతృత్వంలో పండితుల బృందం చండీ హోమం, అలాగే భక్తులతో లక్ష కుంకుమార్చన చేశారు. ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కుంభాభిషేకం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు చెప్పారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసుల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు భేష్





శాంతిపురం: సేవా రత్న అవార్డులు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్సీ భరత్, నాయకులు, రామకుప్పం : విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ

- 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం/శాంతిపురం: వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం రామకుప్పం, శాంతిపురం మండలాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ భరత్ హాజరై వలంటీర్లను సన్మానించి మాట్లాడారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు, వైద్యసాయం అందించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా కుప్పంలో అన్నీ చంద్రబాబే చేస్తున్నారని గతంలో టీడీపీ నాయకులు ప్రచారం చేసుకుంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి వలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టాక వాస్తవాలు ప్రజలకు తెలిసి టీడీపీ మోసానికి తెర పడిందన్నారు. ఎవరిని ఆదరించాలో ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన జనానికి తెలుసన్నారు. రానున్న ఎన్నికలు టీడీపీ అబద్ధాలు, తప్పుడు ప్రచారానికీ, జగనన్న ప్రభుత్వ పనితీరుకు జరగనున్న యుద్ధమన్నారు. బల్ల గ్రామానికి చెందిన వలంటీర్ సుజాతకు సేవావజ్ర అవార్డుతోపాటు రూ.45 వేలు, చెల్దిగానిపల్లె, బైపరెడ్లపల్లె, బల్ల, కొంగనపల్లె, సింగసముద్రం వలంటీర్లు ఆరిఫ్, అమరావతి, శ్రీరాములు, ఈశ్వరయ్య, శివకుమార్‌కు సేవా రత్న అవార్డుతోపాటు రూ.30 వేల చొప్పున పంపిణీ చేశారు. అలాగే రామకుప్పం మండలంలో 249 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డు, రూ.15 వేల చొప్పున ప్రదానం చేసి సన్మానించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, ఎంపీడీఓ ఈశ్వరన్న ,తహసీల్దార్ శ్రీధర్, పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి, శాంతిపురం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కోదండరెడ్డి, వైస్ ఎంపీపీలు పట్టాభి, సరస్వతి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, పీఏసీఎస్ చైర్మన్ మునిరత్నంగౌడు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

రామకుప్పం: రామకుప్పంకు చెందిన శివమ్మ అనారోగ్యంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందింది. వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో ఆమెకు రూ.1.80 లక్షలు మంజూరైంది. బుధవారం ఎమ్మెల్సీ భరత్ ఆ సొమ్ము తాలూకు చెక్కును శివమ్మ భర్త శ్రీనివాసులుకు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, నేతలు చంద్రారెడ్డి, తజ్‌ముల్ పాషా, నారాయణస్వామి, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

చదువుతో ఉన్నత స్థానాలకు..

మండలంలోని విజలాపురం కస్తూర్బా పాఠశాలలో బుధవారం 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు బుధవారం వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మండల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జబీవుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరవలేనివి



బైరెడ్డిపల్లెలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: కరోనా కష్టకాలంలో వలంటీర్లు చేసిన సేవలు మరవలేనివని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం వలంటీర్లను ఘనంగా సత్కరించి సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు అందజేసి మాట్లాడారు. వలంటీర్లతో జగనన్న ప్రభుత్వం మంచి చేయడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక, ఆ వ్యవస్థపై బురద చల్లుతున్నాయని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. మండలంలోని మేఘనాథ్ (దేవదొడ్డి) దివ్యసాయి (ధర్మపురి) ఉషశ్రీ (నెల్లిపట్ల) వెంకటేష్ (లక్కనపల్లె) ఇర్షాద్ (కడపనత్తం) వలంటీర్లకు సేవారత్న, మరో 262 మందికి సేవారత్న అవార్డులు అందజేశారు.ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, సర్పంచులు వెంకటేష్, రాజప్ప, రేణుక, బాలక్రిష్ణగౌడు, రవిచంద్రబాబు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..




చౌడేపల్లెలో..

చౌడేపల్లె: ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరుల చేతుల మీదుగా గడ్డంవారిపల్లె ఎస్.నగేష్‌బాబు,చౌడగానికిపల్లెకు చెందిన లక్ష్మీదేవికి సేవా వజ్ర, చౌడేపల్లె శ్రావణి, ఆమినిగుంట గౌతమి, పుదిపట్ల రమాదేవి, చారాల స్వందన, కొండామర్రి పద్మకు సేవా రత్న అవార్డులు, అలాగే 208 మందికి సేవా మిత్ర అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేసి సత్క రించారు. వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, ఎంపీడీఓ వెంకటేశు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నైతిక విలువలు ముఖ్యం

గుడుపల్లె: వైద్య విద్యలో నైతిక విలువలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు డాక్టర్ ఎస్‌వీకే ప్రసాద్‌రెడ్డి అన్నారు. మెడికల్ ఎథిక్స్, అవేర్‌నెస్ అనే అంశంపై బుధవారం పీఈఎస్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. వైద్య వృత్తిలో సేవా భావం కలిగి ఉండాలని, సమాజం కోసం ఉపయోగపడితే ఆ విద్య ఎంతో మేలు చేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ క్రిష్ణారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, వైస్ ప్రిన్సిపల్ ర్యాలీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఫైనల్ ఇయర్ పరీక్షల్లో 95 శాతం ఉత్తీర్ణత



గౌతమి

వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన 2024 సంవత్సరం ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పరీక్ష ఫలితాలలో తమ కళాశాల 95 శాతం ఉత్తీర్ణత సాధించిందని పీఈఎస్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ తెలిపారు. డిస్టింక్షన్‌లో ఒకరు, ఫస్ట్ క్లాస్‌లో 37 మంది, సెకండ్ క్లాస్‌లో 73 మంది పాసయ్యారని, 79 శాతంతో గౌతమి టాపర్‌గా నిలిచిందని చెప్పారు.

పెద్దారికుంటలో 'ఫ్యామిలీ డాక్టర్'



పెద్దపంజాణి: మండలంలోని పెద్దారికుంట వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో బుధవారం పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి. మురళి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 63 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చండి

పలమనేరు: తల్లిదండ్రుల తమ ఉన్నతి కోసం ఎంతగా శ్రమిస్తున్నారో గుర్తెరిగి వారి ఆకాంక్షలను నెరవేర్చే దిశగా బాగాచదివి ఉన్నత శిఖరాలకు చేరాలని పట్టణంలోని మధు,శ్రీవాణి కళాశాలల ప్రిన్సిపల్, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు క్రిష్ణమూర్తి రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాలల వైస్ ప్రిన్సిపాళ్లు ఆనంద్‌రెడ్డి, గోపిరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను మెడల్స్‌తో సత్కరిస్తున్న నిర్వాహకులు